# ‘రాత్రిరాత్రే పగలుపగలే’

కూచిమంచి శ్రీరామమూర్తిగారు

తెల్లవారింది. సూర్యోదయమయింది ఏడుగంటలు ప్రొద్దెక్కింది ఇంకా లేవడు మోహనరావు పాపం! అతనిగృహలక్ష్మి యిందిర నాలుగుగంటలకే లేచింది పొయ్యి అంటించింది బొగ్గులకుంపటి మీదపడేసింది కాఫీనీళ్లు. నీళ్లు మరిగిపోతున్నాయి. యింకా లేవడు మోహనరావు కాఫీపొడుము నీళ్లలో వేసింది ఆ నీళ్లప్పుడే చల్లారిపోతున్నాయి యింకా లేవడు ఏలాగయితేనేం యిందిర తటపటాయిస్తూ మంచందగ్గరకు వెళ్లింది. గజగజవణకిపోతూంది లేపితే ఏమంటాడో లేపకపోతే యేమంటాడో! చల్లారిపోయినకాఫీ పనికిరాదు సరేకదా! కప్పులు వీధిలోకి ఎగురుతాయి లేపితే తిడతాడనిభయం. ఇంతలో మోహనుడు ప్రక్కకుదొర్లడం సంభవించింది. ఇందిరహస్తములు మోహనునిపైని అప్రయత్నంగా వ్రాలాయి. విసుక్కుంటూ లేచి కాలకృత్యాలుతీర్చుకొని,

‘ఏయ్ కాఫీ’ అన్నాడు

‘చల్లారింది’

‘ఎందుచేత’

‘ఆలస్యం అవడంచేత’

‘మళ్లీపెట్టాలి’

‘ఇదేపనా’

‘ఇంకేంపని’

‘బడివేళకు భోజనంకావాలా’

‘కావాలి’

‘ఏలాగవుతుంది’

‘చేస్తేను’

‘భగవంతుడు నాలుగుకాళ్లు అయిదుచేతులూ ప్రసాదించలేదు’

‘లేకపోతే నీవెందుకు’

‘ఎందుకో మీకేతెలును’ (చిరునవ్వు)

‘వెధకబుర్లుచెప్పక త్వరగాచేయ్’

‘ఇప్పుడెంతయింది.’

‘ఎనిమిదేగా’

‘బడి ఎన్నిఘంటలకు’

‘రోజుచెప్పాలా’

‘అయినా ఒకమారు చెప్పుదురూ దయయుంచి’

‘పదింటికి’

సరే కాఫీతాగండిఅంది చిరునవ్వు మొలకలెత్తుతోంది యిందిరసుందరాననంమీద చిరుమొలకల కర్థము తెలియక విసవిసలాడుతున్నాడు మోహనరావు. కోపం ఎక్కువగావచ్చింది ఎందుకువచ్చిందో అతనికే తెలియదు. పదికావచ్చింది మోహనుడు ‘ఇందిరా! యీవాళ తిండిపెట్టదలచుకోలేదూ!’ అన్నాడు భీకరంగా కాని ప్రేమప్రవాహం చిన్నవుతునయిపోతున్నాడు ఆసంగతి యిందిరకుతెలుసు ఇంకా మొగము చిరునవ్వులతో నిండుతోంది. మోహానికి కోపం నిముషనిముషానికి ఎక్కువౌతోంది. ఇంతట్లో పదికూడాఅయింది మోహనరావు ఒకటిరెండుచేస్తూ స్నానంచేసి భోజనానికివచ్చేడు

‘లేకున్నపోతున్నాను కదా!’ అని ప్రభావం చూపించడానికి ప్రారంభించేడు కూర విసిరేయడం చారు పారబోయడం యీలాంటి క్రూరకృత్యాలు జరిగించాడు తనచాకిరికి రాణింపులేదని యిందిర విచారిస్తోంది కోమలమయినమనస్సు క్రుగ్గిపోతోంది. చివరికి చిలిచిలికి గాలివానయింది కోపంతో సరిగా భోంచేయక బళ్లోకివెళ్లేడు. ఆలస్యంఅవడంచేత లేటుమార్కు Latemark చేసేడు ఏదోబళ్లో చెప్పేడు గాని అతనికి పాలుపోటంలేదు. అకారణవైరం. మాటల పట్టింపువైరంగాని మనస్సులోవైరంకాదు.

ఒంటిగంటయింది మోహనుడు యింటికివచ్చి తలుపు కొట్టేడు. కాని ఏమనుకున్నాడోగాని గిర్రునతిరిగి హోటలుకువెళ్లి కాఫీనిసేవించి, పాఠశాలకు బయలుదేరేడు

పాపం యిందిర విచారిస్తోంది. ఆలోచనలు పుట్టుతున్నాయి. “నేనుమాత్రం మనిషినిగానూ?

నే నేమన్నానని యింతకోపం? ఆయనకే యింత కోపంవుంటే నాకుమాత్రంవుండదూ? ఆయన అర్థాంగినికానూ? యింటికివచ్చి తలుపుకొట్టి కాఫీలేగ నుండా వెళ్లేయ్? పోనీ? వెళ్లనీ? ఈపూటసలురారు కేపూరారూ? అదీచూస్తాను' అనుకుంది అమాయకురాలు అంత నవీననాగరికత ఎరుగని పల్లెటూరిబిడ్డ, పుట్టినవాసం కాపురంచేస్తోంది.

నాలుగయింది బడివదలిపెట్టగానె గోదావరివైపు షికారువెళ్లేడు చల్లనిపిల్లగాలు లాతనిమనస్సుని నిర్మలంగాచేసాయి మనస్సులో భార్యపైనికోపం. కోపంతో ప్రేమా ఎక్కువౌతోంది. కాని నటించడం మానితే లోకువౌతానేమోయని భయం ఇంటికి వచ్చేడు

ఇందిర ఆయనభోజనానికివస్తారా, రారా, అని ఎదురుచూస్తోంది గడియారంవైపు చూచింది రెండు ముళ్లూ ఎనిమిదినిదాటగా ఉన్నాయి 'పిలుస్తాను ఏమంటారోచూస్తాను' అనుకుంది అతడున్నగదినిప్రవేశించి మెల్లగా మృదుమధురస్వరంతో "ఎవరికుంగవు తప్పులు మనుష్యులకు ఉండకపోతే మానులవుంటాయా? ఎనిమిదౌతోంది భోజనానికి దయచేస్తే నాగుంటుంది"

'నాకింకా ఆకల్లేదు'

'కోపంచేతా? ఎందుకీకోపం?'

'సరిదాకి! వెళ్లు'

'భోజనంమాట'

'ఆకలివేస్తే తినచ్చు'

'ఎవరు'

'ఆకలివేసినవారు'

'మీకులేదా?'

'నాకు లే దాకలి'

'నాకుమాత్రం వేస్తుందేమిటి?'

'వెళ్లమంటే తెలియడంలేదూ? నేనురాను నీవు భోజనం పెట్టక్కరలేదు'

'ఎందుచేత?'

'నీగుణాల్నిబట్టి'

'మంచిగుణాలున్న అమ్మాయినే పెండ్లిచేసుకోలేకపోయారు' అంటూ విసవిసనడిచి వెళ్లిపోయింది

వంటింట్లోకివెళ్లి తనకు కావలసిందేదో భుజించి పడకటిల్లుచేరింది నేలమీద చాపవేసుకు పడుకొంది విచారిస్తూ. ఇంతలో మోహనుడు హోటల్లోభోంజేసి, కూనిరాగాలతో, భావగీతాలతో దోమతెరమంచం మీద ప్రవేశించేడు. కాని నిద్రపట్టదు. సిగరెట్టు వెలిగించేడు పూర్తిగాపీల్చి పారేసేడు. ఇంకా నిద్రపట్టదు.

ఆరుబయట వెన్నెల్లోతిరిగివస్తే నిద్రపడుతుందేమోఅని పెరటిలోనికి వెళ్లేడు. అది పున్నమరాత్రి పండువెన్నెల పుచ్చపువ్వల్లా కాస్తోంది. చంద్రుని వంకచూచేడు 'యిలాంటి చల్లనిరాత్రి ప్రణయకలహాలతో వ్యర్థపుచ్చుతున్నావా' యని వెక్కిరిస్తున్నట్టు కనిపించాడు. ఇంతట్లో 'నోరులేనిపక్షులమయిన మావిధంగానైనా అన్యోన్యంగావుండకూడదూ?' అని బుద్ధిచెప్పతోన్నట్టు రెండుపిట్ట లాకచెట్టుపైనుండి చట్టున ఎగిరిపోయాయి మోహను డేమనుకున్నాడో గాని వెంటనేవచ్చి పరుపుమీదచేరేడు.

ఇందిర విచారిస్తోంది, పూర్వపు ముచ్చట్లన్నీ జ్ఞాపకానికితెచ్చుకుంటూ. వేడికన్నీళ్లు నునుచెక్కులనుండి జారిపోతున్నచే, కట్టుకున్న పట్టుపుట్టంపైఁబడి తడిపేస్తున్నాయి. ఎంత! ఆ సోదరీమణి అవస్థ వర్ణించశక్యంకాదు అల్లాంటి భర్తలతో కాపురంచేస్తూన్న మహిళామణులకే విడిచి పెట్టితిని

ఇందిరనోటినుండి అప్రయత్నంగా "లతలకు, లలితలకు తగినఆశ్రయము లభింపకున్న శోభించుట దుస్తరముగదా?" అనేమాటలు గంభీరభావంతో వెలువడ్డాయి. మోహను డేమనుకున్నాడోగాని చటాలున మంచం దిగి యిందిర కరకమలములను పట్టుకొని "ఇందిరా! నిన్నీరోజున చాలాబాధపెట్టితిని, దురహంకారంచేత నన్నునుగ్రహించి నా తప్పులు మరచిపో గృహలక్ష్మి క్షమించు" అన్నాడు సరసవచోగుంభనతో.

ఇద్దరూ పాన్పుపైచేరారు? ఇద్దరి మనస్సులూ నిర్మలంగా పవిత్రంగ ఉన్నాయి. మోహనునిచేతు లాతనిగృహలక్ష్మి ముంగురులు సవరించుటకు సిద్ధపడ్డాయి పెదవులుపెదవులకై వెదుకొంటున్నాయి. తక్కింది మనకెందుకు.